Eenadu 12th March 2018

# జలమండలి అప్పుల కుప్ప!



- తాజాగా రూ.6138 కోట్లకు చేరిన రుణాలు
- నెలా నెలా రూ.40 కోట్లు లోటు బడ్జెట్
- పేరుకుపోతున్న విద్యుత్తు బకాయిలు

ఈనాడు, హైదరాబాద్

నిత్యం కోటి మంది గొంతు తడిపే హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి బోర్డు(జలమండలి) తీవ్రమైన అప్పుల్లో కూరుకుపోతోంది. ముఖ్యంగా అధికమవుతున్న విద్యుత్తు వినియోగం, జీతాలు ఇతరత్రా నిర్వహణ ఖర్చులు పెరుగుతుండటంతో అభివృద్ధి పనులు చేపట్టాలంటే నిధుల కోసం దిక్కులు చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి ప్రాజెక్టు కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. కృష్ణా, గోదావరి ఇతరత్రా ప్రాజెక్టుల కోసం చేసిన అప్పులు తాజాగా రూ.6138 కోట్లు చేరాయి. తాజాగా అవుటర్ రింగ్ రోడ్డు గ్రామాల మంచినీటి విస్తరణ, కేశవాపూర్ స్టోరేజ్ రిజర్వాయర్ ప్రాజెక్టులకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. స్వయంగా ముఖ్యమంత్రే ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న జలమండలికి ఈ దుస్థితి రావడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రస్తుతం జలమండలి ఆదాయానికి, ఖర్చులకు కూడా పొంతన కుదరడం లేదు. నెల నెలా రూ.40 కోట్లు వరకు లోటు బడ్జెట్‌ను మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈ మేరకు నగరానికి చెందిన సుపరిపాలన వేదిక సమాచార హక్కు చట్టం ద్వారా జలమండలి ఇప్పటి వరకు తీసుకున్న రుణాల విషయాన్ని బయట పెట్టింది. కొన్ని రుణాలపై 12.5 శాతం వరకు వడ్డీ చెల్లించడం చూస్తే.. భవిష్యత్తులో బోర్డు పుట్టిమునగడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**రుణాలు ఇలా...**

| సంవత్సరం | తీసుకున్న రుణ మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|
| 2014–15 | 1809.16 |
| 2015–16 | 1588.83 |
| 2016–17 | 2740.00 |
| మొత్తం | 6137.99 |

## వాణిజ్య కేటగిరిలో ఛార్జీలు...

బోర్డును తీవ్ర ఆర్థిక దెబ్బ కొడుతున్న వాటిలో విద్యుత్తు ఛార్జీలదే మొదటి స్థానం. విద్యుత్తు బిల్లులు, కొత్త కనెక్షన్లు ఇతరత్రా ఛార్జీల రూపేణా బోర్డుకు నెలకు రూ.100 కోట్లు వరకు ఆదాయం వస్తోంది. ఇందులో రూ.70 కోట్లు వరకు కరెంటు ఛార్జీల చెల్లించాలి. అయితే నెలకు రూ.40 కోట్లు వరకు మాత్రమే చెల్లిస్తోంది. మిగిలిన బకాయిపై 11 శాతం వరకు పెనాల్టీ పడుతోంది. ఇప్పటికే విద్యుత్తు బకాయిలు రూ.200 కోట్లు దాటేశాయి. అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి నీటిని తరలించి సరఫరా చేస్తున్న జలమండలి ప్రజలకు మాత్రం రాయితీ ధరకు సరఫరా చేస్తుంది. ఇంత చేస్తుంటే దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ మాత్రం వాణిజ్య కేటగిరిలో బిల్లులను వసూలు చేస్తోంది. దీనిపై ఎన్నో సార్లు విద్యుత్తు సంస్థకు వినతులు సమర్పించినా ఎలాంటి ఫలితం కనిపించలేదు. ఇటీవలి కృష్ణా మూడో దశ, గోదావరి ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చిన తర్వాత అదనంగా రూ.30-40 కోట్లు ఛార్జీలు పెరిగాయి. మొత్తంగా ఇప్పటికే రూ.70 కోట్లు పెరిగాయి. త్వరలో ఈ ఛార్జీలు రూ.100 కోట్లుకు దాటే అవకాశం ఉంది.

## అప్పులు చెల్లించడానికి అప్పులు...

గతంలో కరెంటు ఛార్జీలు రూ.300 కోట్లు చెల్లించడానికి జలమండలి ప్రధాన కార్యాలయం తనాఖా పెట్టి అప్పు చేసింది. దీనిపై 12.5 శాతం వరకు వార్షిక వడ్డీ చెల్లిస్తోంది. ఇక గోదావరి ప్రాజెక్టు కోసం హడ్కో నుంచి రూ.3 వేల కోట్లు వరకు రుణం తీసుకుంది. దీనిపై 10.5 శాతం వడ్డీ చెల్లిస్తోంది. తాజాగా శివారు మున్సిపాలిటీలో మంచి నీటి విస్తరణ పనుల కోసం రూ.1900 కోట్లు రుణాలు తీసుకున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ ఉన్న 190 గ్రామాల్లో మంచినీటి సరఫరా కోసం యాన్యుటీ పద్ధతిలో దాదాపు రూ.700 కోట్లతో పనులు జరుగుతున్నాయి. దీనిపై కూడా 13 శాతం వరకు వడ్డీ చెల్లించాలి. త్వరలో చేపట్టనున్న కేశవాపూర్ ప్రాజెక్టును కూడా హైబ్రిడ్ యాన్యుటీ కింద దాదాపు రూ.6 వేల కోట్లతో 13 శాతం వడ్డీతో రుణం తీసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు సాయం అందితే సరేసరి. రానున్న బడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు వరకు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇందులో సగం నిధులు ఇచ్చిన కొంతవరకు ఊరటే. లేదంటే భవిష్యత్తులో జలమండలి పుట్టిమునక తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

### బెంగళూరు విధానం అమలు చేయాలి

– ఎం.పద్మనాభరెడ్డి, సుపరిపాలన వేదిక

రాయితీ ధరలకు నీటిని సరఫరా చేస్తున్న జలమండలి నుంచి వాణిజ్య కేటగిరిలో విద్యుత్తు ఛార్జీలు వసూలు చేయడం దారుణం. బెంగళూరులో ప్రత్యేక కేటగిరి కింద పరిగణించి తక్కువ విద్యుత్తు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇక్కడా అదే విధానం అమలు చేయాలి. ఈ విషయంలో బోర్డుకు ఛైర్మన్‌గా ఉన్న సీఎం చొరవ తీసుకోవాలి. సరఫరా నష్టాలు కూడా 40 శాతం వరకు ఉండటం ఆందోళన కల్గిస్తోంది. తక్షణం బోర్డు ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు తెలిపేందుకు శ్వేతపత్రం విడుదల చేయాలి.